

లెనిన్‌కు ఘననివాళి

నరసరావుపేట ఈస్ట్: రష్యన్ సోషలిస్ట్ వ్యవస్థాపకుడు లెనిన్ జయంతిని మంగళవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జిగురు అట్టల వాడకంపై అవగాహన

ముప్పాళ్ళ: నరసరావుపేట డాట్ ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు చాగంటివారిపాలెంలో రైతులకు జిగురు అట్టల వాడకంపై మంగళవారం అవగాహన కల్పించారు.



వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలో ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.

అనర్హులకే రుణాలు

అర్హులకు మొండిచెయ్యి

- టీడీపీ నేతలు చెప్పిన వారికే రుణాలు
- పేరుకే స్క్రీనింగ్ కమిటీ
- నిరాశలో అర్హులు



లబ్ధిదారుల ఎంపికకు హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

చీరాలటౌన్: సబ్సిడీ రుణాలను టీడీపీ నేతలు పంచుకుతింటున్నారు. అర్హులకు రుణాలు అందించకుండా టీడీపీ నేతలు చెప్పిన వారికే అందిస్తున్నారు. స్క్రీనింగ్ కమిటీ పేరుతో అధికారులు అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారు. ఫలితంగా నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీపై అందించే రుణాలను అర్హులకు కాకుండా టీడీపీ నేత సిఫార్సు చేసిన వారికే కేటాయిస్తున్నా రు. కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలను లబ్ధిదారులకు అందించేందుకు కమిటీ కన్వీనర్ ఎంపీడీవోగా, ఈవోఆర్డీ, పలువురు బ్యాంకుల మేనేజర్లు ఎంపిక కమిటీ సభ్యులుగా నియమించారు. స్క్రీనింగ్ కమిటీని మొక్కుబడిగా ఏర్పాటు చేశారే కానీ తుది నిర్ణయం అంతా ముఖ్యనేతదే. ఆయన ఆమోదం పొందిన వారినే అర్హులుగా నిర్ధారించారు. ఎంపీడీవో కార్యాలయానికి టీడీపీ నాయకులు వచ్చి నేరుగా తమవారికి రుణాలు ఖరారయ్యాయో లేదో అని జాబితాలను చూసుకుంటున్నారు. ప్రభుత్వ అధికారుల అక్రమాలకు టీడీపీ నాయకులు అండగా నిలవడంతో అడ్డూ అదుపులేకుండా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి.

90 యూనిట్లకు 621 మంది దరఖాస్తు

ప్రభుత్వం బీసీ కార్పొరేషన్, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు మండలానికి 90యూనిట్లను కేటాయించగా 621 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరి బ్యాంకు సిబిల్ రేటు, ధ్రువీకరణ పత్రాలను బ్యాంకు మేనేజర్ల సమక్షంలో మండల పరిషత్ అధికారులు విచారణ చేపట్టారు. మండలానికి కేటాయించిన 90 యూనిట్లు బీసీ, ఈబీసీ సబ్సిడీ రుణాలకు రూ.1.69 కోట్లు బ్యాంకు మేనేజర్లు రుణాలను అందించనున్నారు. ఈనెల 9న ఇంటర్వ్యూలు నిర్వహించగా 612 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

సబ్సిడీలను నిర్ధారిస్తున్న టీడీపీ నాయకులు

మా గ్రామానికి కేటాయించిన రుణాలను మా వారందరికీ ఇవ్వాలి....సబ్సిడీలను సైతం మేమే నిర్ధారిస్తాం....మాకు ఇబ్బందులు లేకుండా చూడడంటూ...టీడీపీ నాయకులు అధికారులకు అల్టిమేటం జారీ చేస్తున్నారు. అధికారులు మాత్రం మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దు మీరు చెప్పిన వారికే రుణాలు అందిస్తామని టీడీపీ నేతలకు హామీ ఇస్తూ జీ హుజూర్ అంటున్నారు. ముఖ్యనేత సిఫార్సుతో కేవలం టీడీపీ నాయకులు సూచించిన వారికే ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు వదులుతున్నారు. రుణాల ఎంపికకు సంబంధించి తుది జాబితాలను అధికారులు వివరాల జాబితాను జిల్లా కార్పొరేషన్ కార్యాలయాల కంటే ముందుగా టీడీపీ నేతలకు చూపిస్తున్నారంటే చీరాల్లో రుణాలు ఎవరికి అందుతాయో అర్థం చేసుకోవచ్చు.

జనసేన, బీజేపీలకు దక్కని ప్రాధాన్యం

టీడీపీ అధికారంలోకి రావడానికి ముఖ్యపాత్ర పోషించిన జనసేన, బీజేపీ నాయకులకు చీరాల్లో సరైన ప్రాధాన్యతనివ్వడం లేదనే ప్రచారం జోరుగా సాగుతోంది. జనసేన, బీజేపీ నేతలు సూచించిన వారికి సబ్సిడీ రుణాలు ఇవ్వకపోవడమే అందుకు నిదర్శనమే. గత ఎన్నికల సమయంలో వేరే పార్టీకి పనిచేసి ప్రస్తుతం అధికార పార్టీ పంచన చేరిన మండలంలోని కొందరు నేతలు అంతా తామే అన్నట్లు రుణాల పంపిణీలో చక్రం తిప్పడాన్ని కూటమి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు.

టీడీపీ నేతల తీరుపై ఆగ్రహం

చేనేతలు, రోజువారీ కూలీలు, చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగులకు చేయూతనిచ్చే రుణాల ఎంపికలో అర్హులకు కాకుండా టీడీపీ నేతలకే రుణాలు కేటాయిస్తుండటంతో అధికారులు, టీడీపీ నేతల తీరుపై ప్రజలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. నియోజకవర్గ టీడీపీ ముఖ్యనేతలు సిఫార్సు చేసిన వారికి మాత్రమే రుణాలు కేటాయించడంతో గ్రామాల్లోని అర్హులు మాత్రం టీడీపీ, ముఖ్యనేత తీరుపై బాహాటంగా విమర్శలు గుప్పిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సబ్సిడీ రుణాల కోసం ఎదురుచూపులు చూస్తున్న లబ్ధిదారుల ఆశలకు ముఖ్యనేత జాబితా తయారుతో బ్రేక్ పడింది. కొద్ది రోజుల క్రితం కార్పొరేషన్ రుణాలను అర్హులకు కాకుండా అనర్హులకు, ప్రజాప్రతినిధి చెప్పిన వారికే ఇవ్వడంతో గ్రామాల్లో విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

జాబితాను బ్యాంకులకు పంపాం

కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలను పూర్తిచేశాం. ఎంపిక కమిటీ జాబితాను ఆయా బ్యాంకులకు పంపించాం. సిబిల్ ప్రకారం రుణాలు అందిస్తాం. బ్యాంకులు నిర్ధారించి, నమ్మకమైన వ్యక్తులకే రుణాలు అందిస్తారు. మిగిలిన వారికి మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించి రుణాలు అందించేందుకు కృషి చేస్తాం.

– బి.శివసుబ్రహ్మణ్యం, ఎంపీడీవో చీరాల.



విలేకరులతో మాట్లాడుతున్న మేరుగ నాగార్జున

లా అండ్ ఆర్డర్ ఉందా

- బీసీ సామాజిక వర్గీయుడిపై దాడి జరిగితే కనిపించలేదా
- వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున

అద్దంకి రూరల్: ''అధికారం వచ్చిందని ఏదైనా చేస్తారా.. ఒక బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిపై దాడి జరిగితే లా అండ్ ఆర్డర్ ఏమైంది. దాడి జరిగిన విషయం అక్కడి ఎస్సైకి తెలియదా... ఎందుకు ఇంతవరకు కేసు కట్టలేదు'' అంటూ వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ బల్లికురవ మండల కన్వీనర్‌ను స్టేషన్‌కు పిలిపించి బెదిరించటం, వైఎస్సార్ సీపీకి చెందిన వారిపై దాడి జరిగితే ఎస్సై స్పందించడా అని ప్రశ్నించారు. బల్లికురవ మండలం సోమవరప్పాడు గ్రామంలో టీడీపీ సానుభూతిపరుల దాడిలో తీవ్రంగా గాయపడి అద్దంకి వైద్యశాలలో చికిత్స పొందుతున్న గోపిరాజుయాదవ్‌ను నాగార్జున మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోపిరాజు యాదవ్‌పై ఇప్పటికి మూడుసార్లు దాడి జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకసారి కొట్టటం, మరోసారి కత్తితో నరకటం, ఇప్పుడు కర్రలతో దాడి చేయడమేమిటని ప్రశ్నించాడు. అతను సోషల్ మీడియాలో పనిచేస్తున్నాడనా, బీసీ కులస్తుడు పేదవాడు ఏమీ చేయలేడనా, దాడి చేశారని ప్రశ్నించారు. అధికారం వచ్చిందని ఏమైనా చేస్తామంటే సరిపోదన్నారు. సోమవారం దాడి జరిగితే ఇంతవరకు కేసు రిజిస్టర్ చేయకపోవటం ఏమిటని ప్రశ్నించారు. అక్కడ ఎస్సైకి దాడి చేసిన విషయం తెలియదా అన్నారు. దాడి విషయమై తాను ఎస్పీతో మాట్లాడానని, ఆయన వెంటనే స్పందించి కేసు రిజిస్టర్ చేయిస్తామని చెప్పామన్నారు. ఉన్నతాధికారి స్పందించిన విధంగా స్థానిక ఎస్సై, సీఐ ఎందుకు స్పందించలేదని అన్నారు. అక్కడ ఎస్సై ఏమి చేస్తున్నాడన్నారు. వైఎస్సార్ సీపీ పార్టీతో పాటు తామంతా అండగా ఉంటామని ఈ విషయాన్ని మా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కేసు రిజిస్టర్ చేసి సునిశితమైన విచారణతో దాడికి పాల్పడ్డ వారిని శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. నాగార్జున వెంట బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పానెం హనిమిరెడ్డి సోదరులు నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అద్దంకి పట్టణ వైఎస్సార్ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, బల్లికురవ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, వైఎస్సార్ సీపీ అద్దంకి మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, సంతమాగులూరు మండల కన్వీనర్ వుట్ల నాగేశ్వరరావు సర్పంచ్ నగేష్, కోల్లా భువనేశ్వరి, షేక్ అబిదా, వార్డు కౌన్సిలర్‌లు, ఇన్‌చార్జిలు, స్థానిక నాయకులు ఉన్నారు.

న్యూస్‌రీల్

25కు అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ దరఖాస్తు పొడిగింపు

బాపట్ల: అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ దరఖాస్తు గడువు ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత రక్షణ శాఖ వివిధ దళాల రిక్రూట్‌మెంట్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన అగ్ని పథకంలో భాగంగా ఆర్మీలో ఉద్యోగాల ప్రకటన జారీ అయినదని జిల్లా కలెక్టర్ తెలిపారు. అగ్ని జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్ విభాగాలలో ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయని, అర్హులైన యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి రాత పరీక్షను ఆన్‌లైన్ ద్వారా జూన్ 2025న నిర్వహిస్తారని తెలిపారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలన



వెలగపూడి(తాడికొండ): తుళ్ళూరు మండలం వెలగపూడి గ్రామంలోని సచివాలయం సమీపంలో మే 2వ తేదీన జరగనున్న అమరావతి తదితర శంకుస్థాపన కార్యక్రమాల్లో ప్రధాని మోడీ పాల్గొననున్న నేపథ్యంలో ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజలతో కలిసి మంగళవారం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. హెలిప్యాడ్ నిర్మాణం, ప్రధాని రోడ్ షో సాగే మార్గాలు, ప్రధాన వేదిక, పబ్లిక్, వీవీఐపీ, గ్యాలరీల వద్ద ఏర్పాట్లను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏర్పాట్లు నిర్దేశిత సమయం కంటే ముందే వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఎం.నవీన్ కుమార్, అడిషనల్ ఎస్పీ సుప్రజ, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మేయర్ ఎన్నికకు 28న ప్రత్యేక సమావేశం

నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

నెహ్రూనగర్: గుంటూరు నగర మేయర్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మంగళవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ ఉత్తర్వులను అనుసరించి, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టర్ డాక్టర్ పి. సంపత్ ఈ నెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు మేయర్ ఎన్నిక నిర్వహించాలని, ఈ ఎన్నికకు గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ్ తేజను ఎన్నికల అధికారిగా నియమించారు. ఎన్నికల అధికారి ద్వారా ఈ నెల 24 లోపు గుంటూరు నగర పాలక సంస్థ కార్పొరేటర్లకు, ఎక్స్ అఫిషియో సభ్యులు 28న ప్రత్యేక సమావేశానికి హాజరు కావలసినదిగా నోటీసులు అందనున్నాయి. షెడ్యూలు ప్రకారం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మేయర్ ఎన్నిక జరుగుతుందని ఎలక్షన్ అథారిటీ, సీడీఎంఏ డాక్టర్ పి. సంపత్ ఉత్తర్వులు జారీ చేశారు.

దళితుడిపై జన సేన నాయకుడు చెప్పుతో దాడి

చావలి(వేమూరు): వేమూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి ఊసా రాజేష్ ఓ దళితుడిపై చెప్పుతో దాడి చేశారు. వేమూరు మండలం చావలి గ్రామానికి చెందిన జనసేన పార్టీ ఇన్‌చార్జి ఊసా రాజేష్ దళితవాడకు చెందిన పొతుల కొండయ్యపై దాడి చేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్రాంతి పథకం ద్వారా చావలి దళితవాడకు చెందిన డ్వాక్రా గ్రూపునకు ఉన్నతి రుణం మంజూరైయింది. ఉన్నతి లోన్ దళితవాడకు చెందిన డ్వాక్రా మహిళలను అడ్డు పెట్టుకొని రాజేష్ రుణం పొందాడు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలు కూడా ఎస్సీలను అడ్డు పెట్టుకొని పొందడం జరుగుతుందని కొంత మంది వ్యక్తులు మాట్లాడుకోవడం జరిగింది. రాజేష్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఊసా రాజేష్ కొండయ్యకు ఫోన్ చేసి హిందు శ్మశానవాటిక వద్దకు రావాలని చెప్పాడు. దీంతో కొండయ్య శ్మశానవాటిక వద్దకు వెళ్లాడు. ఎస్సీ కార్పొరేషన్ లోను రాకుండా చేస్తాను, ఉన్నతి లోను కూడా రాకుండా చేశాను. మీరు ఆలోచించుకోవాలని చెప్పాడు. దీంతో మాటామాటా పెరగడంతో ఊసా రాజేష్ చెప్పుతో కొట్టాడని కొండయ్య చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత దళితులపై దాడులు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన నాయకుడు ఊసా రాజేష్‌పై కొండయ్య వేమూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్, లేట్ ఖరీఫ్, రబీ సీజన్లతో కలిపి లక్షా 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని అన్నారు. ప్రభుత్వం జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. బాపట్ల నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే 47 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పది వేల మెట్రిక్ టన్నులు రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతు సేవా కేంద్రాలకు ముందుగా ధాన్యం తెచ్చిన రైతుల నుంచి కొనుగోలు చేయాలని అన్నారు. రాబోయే సీజన్‌లో 5204, బీపీటీ రకం పంటలు సాగు చేసే విధంగా రైతులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఒకే రకమైన పంటలు కాకుండా పంట మార్పిడి విధానానికి వెళ్లాలని సూచించారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా మంత్రులతో కలిసి జిల్లాకు మరో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి అదనపు లక్ష్యాలను ఇవ్వాలని కోరతామని చెప్పారు. రాబోయే సీజన్‌లో డిమాండ్ మేరకు వరి సాగు చేయాలని రైతులకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, జిల్లామార్కెటింగ్ శాఖ అధికారి రమేష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనులు విస్తృతంగా చేయించాలి

ఉపాధి హామీ పథకం కింద అధికారులు విస్తృతంగా పనులు గుర్తించి, నిరుపేదలకు జీవనోపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపడుతున్న అభివృద్ధి పనులపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వలసలు పూర్తిగా నివారించాలంటే నిరుపేదలకు జీవనోపాధి చూపాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పనులు విస్తృతంగా చేపట్టాలన్నారు. చుండూరు మండలంలో పనుల పురోగతి లేకపోవడంపై ఎంపీడీవోను కలెక్టర్ నిలదీశారు. కథలు చెప్పడంమాని, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జిల్లా వ్యాప్తంగా 1.09 లక్షల మొక్కలు ఈ ఏడాది నాటించాలని చెప్పారు. ఐదు హెక్టార్లలో మడ అడవులు పెంచాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలోని తీర ప్రాంతం వెంట 30 వేల మొక్కలు నాటాలని, అవి పెరిగే వరకు పర్యవేక్షణ ఉండాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ విజయలక్ష్మి, ఎంపీడీవోలు, ఏపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేలు వేగవంతం చేయాలి

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహించే సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మనమిత్ర వాట్సాప్ సేవ పోర్టల్ ద్వారా ప్రజలు ప్రభుత్వ సేవలను పొందేందుకు రిజిస్ట్రేషన్ చేయించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని క్లస్టర్లలో ఇంటింటికి వెళ్లి మనమిత్ర యాప్ ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించి వారి ఫోన్‌లో మన మిత్ర యాప్ ను డౌన్‌లోడ్ చేయించాలన్నారు. ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధామాధవి, రేపల్లె, చీరాల డీఎల్‌డీఓలు పద్మ, పద్మావతి, అన్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఆయన రూటే సపరేటు

- లంచం ఇస్తే కేసు పరిష్కారం
- ఇవ్వకుంటే పెండింగ్
- వేమూరు ఎస్‌ఐ అవినీతి లీలలు



వేమూరు పోలీసుస్టేషన్

వేమూరు: తమకు అన్యాయం జరిగిందని స్టేషన్‌కు వచ్చిన బాధితులకు అండగా నిలవాల్సిన ఎస్‌ఐ వారి పట్ల కాలయముడిగా మారుతున్నాడు. తాను అడిగిన లంచం ఇస్తే సరే, ఇవ్వకుంటే వేధింపులకు గురిచేస్తున్నాడు. కేసులను తారుమారు చేస్తున్నాడు. దీంతో తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాధితులు మదనపడుతున్నారు. ఆ ఎస్‌ఐ పచ్చనేతలకు గులాంగిరి చేస్తున్నాడు.

పోలీసుస్టేషన్‌లో ప్రైవేట్ వ్యక్తి హవా

పోలీసుస్టేషన్ ఎస్‌ఐ రవికృష్ణ అండదండలతో ప్రైవేటు వ్యక్తి హవా కొనసాగిస్తున్నాడు. స్టేషన్‌కు వచ్చిన బాధితులతో ముందే అతను మాట్లాడి అంతా ఓకే అనుకున్న తర్వాత ఎస్‌ఐ వద్దకు పంపిస్తాడు. రోడ్డుపై వాహనాలు కూడా ప్రైవేటు వ్యక్తి ద్వారా తనిఖీ చేయిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

ఎస్‌ఐ, ప్రైవేట్ వ్యక్తి మధ్య విభేదాలు

సివిల్ కేసు వ్యవహారంలో ఎస్‌ఐకి, ప్రైవేటు వ్యక్తి మధ్య విబేధాలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రైవేటు వ్యక్తి సోషల్ మీడియాలో ఎస్‌ఐపై పోస్టులు పెట్టాడు. దీనిపై ఎస్‌ఐ ఫోన్‌చేసి ప్రైవేటు వ్యక్తిని బెదిరించినట్లు సమాచారం. అయితే ప్రైవేట్ వ్యక్తి ఎస్పీ వద్దకు వెళ్లి కూర్చుంటానని చెప్పడంతో ఎస్‌ఐ మిన్నకుండిపోయినట్లు తెలిసింది.

ఇసుక అక్రమార్కుల నుంచి ముడుపులు

ఇసుక అక్రమంగా తరలిస్తున్న నిర్వాహకులు పోలీసుస్టేషన్‌కు ప్రతి నెలా ముడుపులు చెల్లిస్తుండడంతో ఎలాంటి కేసులు నమోదు చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏప్రిల్ 3వ తేదీన బూతుమల్లి వంతెన వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ లారీ, ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ఇసుక లారీ రోడ్డుకు అడ్డుగా పడిపోయింది. రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు మాత్రం ఘటనా స్థలం వద్దకు రాలేదు. గుంటూరు నుంచి అక్రమ ఇసుక నిర్వాహకులు వచ్చి ట్రాక్టర్ యాజమానితో మాట్లాడుకొని కేసు లేకుండా చేసుకున్నారు.

ఎస్‌ఐ అవినీతి లీలల్లో కొన్ని...

- మండలంలోని చదలవాడ గ్రామంలో గత నెల 19వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి 10 సవర్ల బంగారం దొంగతనం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో లంచం డిమాండ్ చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.
- బలిజేపల్లి గ్రామంలో మార్చి 4వ తేదీన మొక్కజొన్న పొలానికి నీరు పెడుతున్న తండ్రిని పెద్ద కుమారుడు హత్య చేశాడు. తన తండ్రిని అన్న హత్య చేశాడని చిన కుమారుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. హత్య చేసినట్లు ఆరోపించబడుతున్న వ్యక్తి తెలుగుదేశం నాయకులను ఆశ్రయించాడు. టీడీపీ నాయకుల ఒత్తిడి, ఎస్‌ఐకి లంచం ఇవ్వడంతో ప్రమాదవశాత్తూ చనిపోయినట్లు కేసు నమోదు చేశారు.
- చావలి గ్రామానికి చెందిన కేసులో స్టేషన్ బెయిల్ కోసం రూ.30 వేలు ఎస్‌ఐ లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఎస్‌ఐ అడిగిన మొత్తం ఇవ్వడంతో స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు బాధితులు చెబుతున్నారు.
- జంపని గ్రామంలో యల్లమాటి ప్రభాకర్ ఓ మహిళపై వంట్రంగి ఉల్లి కత్తితో దాడి చేశాడు. తాను అడిగినంత లంచం ఇవ్వలేదని హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు బాధితుడు వాపోయాడు.
- పెనుమర్రు గ్రామంలోని కాలువల్లో చేపలు పట్టుకొనే విషయమై ఇరువురి మధ్య గొడవ జరిగింది. గోరికపూడి చినరత్నం కుటుంబ సభ్యులు గోరికపూడి మనోజ్‌పై దాడి చేశారు. బాధితుడు తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాడు. బాధితుడు ఆసుపత్రిలోని పోలీసు అవుట్ పోస్టులో ఫిర్యాదు చేశాడు. కేసును వేమూరు పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. బాధితుడు మనోజ్‌ను ఎస్‌ఐ లంచడం డిమాండ్ చేసినట్లు సమాచారం. లంచం ఇవ్వకపోవడంతో దాడి చేసిన వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు ఆరోపించాడు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



మా అన్నకు, నాకు ఆస్తుల విషయమై గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మొక్కజొన్న పొలంలో నీరు పెట్టేందుకు వెళ్లిన మా నాన్న వేజండ్ల పూర్ణచంద్రరావును మా అన్న హత్య చేశాడు. ఈ విషయమై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

– వేజండ్ల ప్రభాకరరావు, బలిజేపల్లి గ్రామం.

ఉర్దూ పాఠశాల తొలగించవద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మార్టూరు: మండలంలోని వలపర్ల గ్రామంలో గల ఉర్దూ పాఠశాలను తొలగిస్తున్నారంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో పాఠశాల విద్యార్థులు స్థానికులతో కలిసి మంగళవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బాలికల తల్లిదండ్రులు విలేకరులతో మాట్లాడుతూ ఒకపక్క అధికారులు, ప్రజా ప్రతినిధులు బాలికా విద్యను ప్రోత్సహిస్తున్నామంటూ స్టేట్‌మెంట్‌లు ఇస్తున్నారన్నారు. కానీ మరో పక్క బాలికలు ఎక్కువగా అభ్యసిస్తున్న ఉర్దూ పాఠశాలను తొలగించటం ఏంటని ప్రశ్నించారు. గత మూడు దశాబ్దాలుగా గ్రామంలో ఉన్న ఉర్దూ పాఠశాలను అభివృద్ధి పరుస్తున్నామంటూ తొలగించడం, ఉపాధ్యాయులను తగ్గించడం అన్యాయమని తమ పాఠశాలను కొనసాగించాలని కోరారు. పాఠశాల చైర్మన్ షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి


ఇంకొల్లులో సోమవారం రైతులతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమం అనంతరం మాట్లాడుతున్న గాదె మధుసూదనరెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధూసూదనరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతుల స్థితిగతులు, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సోమవారం ఇంకొల్లులో రైతులతో కలిసి భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గిట్టుబాటు ధర లేదంటూ ఆందోళన చెందిన రైతులు పొగాకును తగలబెట్టి తమ నిరసన తెలిపారన్నారు. దాదాపు 500 మందికి పైగా రైతులు ఈ నిరసనలో పాల్గొనడాన్ని చూస్తే పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఏ స్థాయిలో ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. రైతు పండించిన పంటలకు గత ప్రభుత్వం మాదిరిగానే గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని, రైతులు పండించిన పొగాకును ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు చేసి నష్టపోకుండా చూడాలని ఆయన కోరారు.

వైఎస్ జగన్ హయాంలో...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించారని, ఆ సమయంలో రైతులు లాభాలు చవిచూశారన్నారు. ఆయన కల్పించిన 'మద్దతు'తో ఈ సీజన్‌లో భారీగా పెట్టుబడులు పెట్టి రైతులు పొగాకు సాగు చేపట్టారని గాదె మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా స్థానిక రైతులు నల్లబర్లీ పొగాకును ఎక్కువగా పండించారని అన్నారు. ప్రధానంగా పర్చూరు డివిజన్‌లో సుమారు లక్ష ఎకరాలలో నల్ల బర్లీ పొగాకు సాగు చేశారని అన్నారు. పొగాకు పంటను కొనుగోలు చేస్తామని మొదట్లో మాటిచ్చిన కంపెనీలు సైతం నేడు కనిపించకుండా పోవడంతో రైతులను దిక్కుతోచని పరిస్థితులలో సోమవారం రోడ్డెక్కాన్నారు. మరో వైపు మొక్కజొన్న, మిర్చి, మినుము, శనగ, వరి పంటల పండించిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పంట దిగుబడులు వచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని, పంటను గోడౌన్‌లలో నిల్వ చేసి ప్రయోజనం లేదన్నారు. ఈ పరిస్థితులో రైతులను ఆదుకోవాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై ఉందని గాదె మధుసూదనరెడ్డి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల బాధలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే రైతుల తరపున వైఎస్సార్‌సీపీ అండగా ఉండి పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విషయమై చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ చూపి రైతులకు మేలు చేయాలని, అప్పటి వరకు వేచి చూస్తామని లేనిపక్షంలో రైతులతో కలిసి పోరాటం చేయక తప్పదని అన్నారు. ఇంకొల్లులో సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు భవనం శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, షేక్ బాబుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు పఠాన్ కాలేషావలి, జిల్లా కార్యదర్శి కొండూరి గోవింద్, ఇంకొల్లు, మార్టూరు, చినగంజాం, కారంచేడు, యద్దనపూడి మండల కన్వీనర్‌లు చిన్ని పూర్ణారావు, జంపని వీరయ్యచౌదరి, మున్నం నాగేశ్వరరెడ్డి, జువ్వా శివరామప్రసాద్, రావూరి వేణు, జిల్లా కమిటీ సభ్యులు కోట శ్రీనివాసరావు, తోకల కృష్ణమోహన్, దండా చౌదరి, ఆసోది బ్రహ్మానందరెడ్డి, దాసరి వెంకటరావు, బిల్లాలి డేవిడ్, కరి వాసు, తమ్మా అమ్మిరెడ్డి, గడ్డం మస్తాన్‌వలి, మాచవరపు రవికుమార్, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారన్నారు.

క్లుప్తంగా

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ బాపట్లలో ఆపాలి


మాట్లాడుతున్న పౌర సమాఖ్య సభ్యులు కారుమంచి విజయకుమార్

బాపట్ల: సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ బాపట్లలో తప్ప అన్ని జిల్లా కేంద్రాల్లో ఆగుతుందని పౌర సమాఖ్య సభ్యుడు కారుమంచి విజయకుమార్ పేర్కొన్నారు. బాపట్లలోని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విజయకుమార్ మాట్లాడారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ బాపట్లలో కూడా ఆగేలా చర్యలు తీసుకోవాలని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ని జూన్ 2024లోనే పౌర సమాఖ్య కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదే రైలు చీరాలలో నిలుపుదల చేసేందుకు ఎంపీ కృషి చేస్తున్నట్లు వస్తోన్న వార్తలు ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. జిల్లా కేంద్రమైన బాపట్లలో ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాపట్ల స్టేషన్‌లో మధ్యలో రద్దయిన రైళ్లని పునరుద్ధరించాలని, ఉప్పరపాలెం, కంకటపాలెం గేట్ల వద్ద ఆర్వోబీలుగాని, లేక పరిమిత అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జమృద్‌బాషా, కందుల రమణకుమార్, జి. వెంకటేశ్వర్లు, పి.సి.సాయిబాబు, తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం



రేపల్లె రూరల్: గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం పెనుమూడి గ్రామం వద్ద కృష్ణా నదిలో లభ్యమైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మహిళ మృతదేహం కృష్ణా నదిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు మంగళవారం పోలీసులకు సమాచారం అందించారన్నారు. పోలీసులు పెనుమూడిలోని సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పట్టణ సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ మృతురాలికి సుమారు 65 సంవత్సరాల వరకు ఉండవచ్చని పేర్కొన్నారు. ఆమె పుష్కర ఘాట్ వద్ద ఒంటరిగా కూర్చుని ఉండటానికి గమనించిన స్థానికులు వివరాలు అడగ్గా తాను తన మనవడు పుష్కర్ ఘాటు వద్ద నిద్ర చేయాల్సి ఉందని, తన మనవడు ఇంకా రాలేదని బాపట్ల నుంచి వస్తున్నాడని తెలిపిందని అన్నారు ఉదయం చూడగానే నదిలో శవమై తేలిందన్నారు. ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీంచి శవ పంచనా మా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభు త్వ వైద్యశాలకు తరలించామన్నారు. మృతు రాలి పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకురాలు మృతి



బల్లికురవ: రోడ్డుపై వెళుతున్న యాచకురాలిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన మంగళవారం మేదరమెట్ల- నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని మండలంలోని వీ.కొప్పరపాడు శివాలయం ఎదుట జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. నాలుగు నెలల నుంచి మహిళ(55) గ్రామంలో తిరుగుతూ యాచన చేస్తూ పెట్టిన ఆహారాన్ని తింటూ రాత్రికి బస్‌షెల్టర్‌లో నిద్రిస్తుంది. రోడ్డుపై వెళుతున్న మహిళను నార్కెట్‌పల్లి వైపు వెళుతున్న వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న బల్లికురవ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని భౌతికకాయాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఓటర్ల జాబితా రూపకల్పనలో బీఎల్‌ఓలదే కీలక పాత్ర


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ గ్లోరియా

బాపట్ల ఆర్డీఓ గ్లోరియా

బాపట్ల:ఓటర్ల జాబితా రూపకల్పనలో బీఎల్ ఓల పాత్ర అత్యంత కీలకమైందని బాపట్ల ఆర్డీఓ గ్లోరియా అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో బీఎల్‌ఓలకు ఓటర్ల జాబితాపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఓటర్ల జాబితా రూపొందించడంలో బీఎల్‌వోలు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వెయ్యి ఓట్లు దాటితే రెండో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సందర్భంలో వారందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, తహసీల్దార్లు షేక్ సలీమా, సుందరమ్మ, వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్యాద్రి, బీఎస్పీ నాయకులు కాగిత కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దోనేపూడి రవి, జనసేన నాయకులు బీఎల్వోలు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే కల్పవల్లి.. గంగమ్మతల్లి

- నేటి నుంచి ఐదు రోజులు అమ్మవారికి ప్రత్యేక పూజలు
- 27న శిడిమహోత్సవం, తిరునాళ్లు


తిరునాళ్లకు ముస్తాబవుతున్న దేవాలయం


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

కారంచేడు: కోరిన కోర్కెలు తీర్చే భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కారంచేడు గంగమ్మ తల్లి శిడి మహోత్సవం ఈనెల 27వ తేదీ ఆదివారం వైభవంగా జరగనుంది. గ్రామంలోని పుట్టాయిపాలెంలో పెద్ద ఎత్తున జరిగే గంగమ్మ తల్లి తిరునాళ్లకు ఎంతో విశిష్టత ఉంది. 38 ఏళ్లుగా ప్రతి ఏడాదీ అమ్మవారి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తారు. శక్తి స్వరూపం కలిగి, భక్తుల పాలిట కొంగు బంగారంగా ఉండే గంగమ్మ అమ్మవారి గుడి అంటే సమీప ప్రాంతంలో మంచి ప్రసిద్ధి. తొలుత స్థానిక గ్రామస్తులు చిన్న గుడిని ఏర్పాటు చేసి అమ్మవారిని ప్రతిష్ఠించగా ప్రస్తుతం ఆ దేవాలయం దినదినాభివృద్ధి చెందింది. దేవాలయం అభివృద్ధిలో దేవస్థాన కమిటీ, సభ్యులు విశేష కృషి చేశారు. ప్రతివారంలో మంగళ, ఆదివారాల్లో భక్తులు విరివిరిగా వచ్చి విశేష పూజలు నిర్వహిస్తుంటారు. ఆపదలో ఉన్న భక్తుల కష్టాలు, కోర్కెలను తీర్చే తల్లిగా పోలేరమ్మ తల్లికి పేరుంది. అందుకే ప్రతి ఏడాదీ అమ్మవారి తిరునాళ్ల, శిడి మహోత్సవాన్ని ఘనంగా జరుపుతారు. తిరునాళ్ల రోజు శిడి పెళ్లి కొడుకుతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వెళ్లి గుడి వద్ద ఉండే శిడి మానుకు ఒక పెట్టెలో మేకపోతును ఉంచి, గుడి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేస్తారు. ఈ సమయంలో శిడిమాను పైభాగంలో చెక్కపెట్టెలో ఉంచిన మేకపోతును భక్తులు జీడికాయలతో కొడుతుంటారు. శిడిమాను లాగితే కష్టాలు తొలిగిపోతాయని భావించే భక్తులు శిడిమాను బండిని లాగేందుకు పోటీ పడతారు. తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేకంగా విద్యుత్ ప్రభలు ఆకర్షణగా నిలుస్తాయి. ఈ ఏడాది ప్రభలతోపాటు నాటికలు, కళాకారులతో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పా టు చేశారు. తిరునాళ్లను పురస్కరించుకొని పశుసంపదతోపాటు వాహనాలను గుడి చుట్టూ తిప్పి ప్రజలు తమ మొక్కులు తీర్చుకుంటారు. ఈ తిరునాళ్లకు గ్రామ ఆడపడుచులు ఎక్కడ ఉన్నా గ్రామానికి చేరుకుంటారు. తమ ఇంటి ఇలవేల్పుకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. ఈ పండుగకు బాపట్ల, ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల నుండే కాకుండా మండలంలోని అన్ని గ్రామాలతో పాటు పరిసర గ్రామాల నుంచి తిరునాళ్లను చూసేందుకు ప్రజలు వేల సంఖ్యలో వస్తుంటారు.

భారీ బందోబస్తు

తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చీరాల డీఎస్పీ ఆధ్వర్యంలో ఇంకొల్లు సీఐ, కారంచేడు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి ఐదు రోజుల ప్రత్యేక పూజలు

బుధవారం పోలేరమ్మ, గంగాభవానీ అమ్మవార్లకు తలంట్లు, నైవేద్యాల సమర్పణ, సాయంత్రం పావనం బొల్లావుల ఊరేగింపు, 24వ తేదీన రాజు, ప్రధాని బియ్యం కోల, బద్దె గొర్రె, 25వ తేదీన పాలవెల్లి, కథా కాలక్షేపం, 26వ తేదీన ఆగుమంచి బోనాలు, ఆడపడుచుల జమ్మి పొంగళ్లు, సాయంత్రం పాలేరు దగ్గర గంగా, కాటమరాజుల తర్కవాదాలు, 27వ తేదీ ఉదయం గ్రామంలోని పశువులు, నూతన వాహనాలు ప్రత్యేక అలంకరణలో గుడి చుట్టూ ప్రదక్షిణలు, సాయంత్రం శిడి పెళ్లికుమారుడి ఊరేగింపు, శిడిమాను మహోత్సవం, విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 28న అమ్మవారి పొంగళ్లతో తిరునాళ్ల ముగింపు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

స్వగ్రామానికి చేరిన విద్యార్థి మృతదేహం

- తిరుచ్చిలో ఇంజినీరింగ్ చదువుతున్న వెంకటేష్
- ఈతకు వెళ్లి మృతి
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు


వెంకటేష్ (ఫైల్)

అద్దంకి: ఇంజినీర్‌ై తిరిగి ఇంటికి వస్తాడనుకున్న కుమారుడు చదువు పూర్తికాక మునుపే శవమై ఇంటికి చేరడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈత సరదా ఆ విద్యార్థి ప్రాణం తీసింది. ఈ ఘటన తమిళనాడులోని తిరుచ్చిలో జరిగింది. తిరుచ్చి నుంచి భౌతిక కాయం మంగళవారం ఇంటికి చేరింది. కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు.. మండలంలోని గోవాడ గ్రామానికి చెందిన మాదాల నాగేశ్వరరావు కుమారుడు వెంకటేశ్(20) పదో తరగతి వరకూ అద్దంకిలో, ఇంటర్ గుంటూరులో అభ్యసించాడు. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు తమిళనాడులోని తిరుచ్చి సమీపంలోని ధనలక్ష్మి శ్రీనివాసన్ విశ్వవిద్యాలయంలో గత సంవత్సరం చేరాడు. ప్రస్తుతం రెండో సంవత్సరం చదువుతున్నాడు. అక్కడ తోటి విద్యార్థులు ఎనిమిది మందితో కలసి ఒకేగదిలో ఉంటున్నాడు. ప్రతి రోజూ కళాశాలకు వెళ్లి తిరిగి వస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం వారు నివసించే గదికి సమీపంలోని బావిలో ఈతకు దిగారు. ఒకసారి అందరూ ఈత వేసి ఒడ్డుకు చేరినా రెండోసారి వెంకటేశ్ ఈతకు దిగాడు. తాను వేసుకున్న గాలి పైపు పక్కకు తొలగడంతో మునకేశాడు. గమనించిన తోటి విద్యార్థులు కాపాడాలని ప్రయత్నించినా వీలు కాకపోవడంతో కాపాడటానికి ప్రయత్నించిన మరో యువకుడు ప్రకాశం జిల్లా సంతనూతలపాడు గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్, వెంకటేశ్ నీట మునిగి ప్రాణాలు కోల్పోయినట్లు బంధువులు తెలిపారు. ఈ విషయం తోటి విద్యార్థుల ద్వారా సమాచారం అందుకున్న బంధువులు తిరుచ్చి వెళ్లి భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి మంగళవారం అంత్య క్రియలు నిర్వహించారు. నాగేశ్వరరావుకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఆకస్మికంగా మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. దీంతో గ్రామంలోనూ విషాద ఛాయలు నెలకొన్నాయి.

ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్

చీరాల రూరల్: కుల, మతాలకతీతంగా పరిపాలన చేస్తామని భారత రాజ్యాంగంపై ప్రమాణంచేసి ఉప ముఖ్యమంత్రి పదవి పొందిన పవన్ కల్యాణ్ ఆవిధంగా పరిపాలన చేయడంలేదని, దళితులు, ముస్లింలు, క్రైస్తవులకు వ్యతిరేకంగా పనిచేస్తూ కేవలం సనాతన ధర్మాన్ని మాత్రమే కాపాడుతానని మాట్లాడుతున్నారని అది మంచి పద్ధతి కాదని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిఠాపురం నియోజకవర్గంలో దళిత మహిళలు లైంగిక వేధింపులకు గురై సాంఘిక బహిష్కరణ జరిగినా, వారిపై దాడులు జరిగినా పవన్ కల్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని పాటిస్తానని బహిరంగంగా చెపుతూ ఇతర మతాలను కించపరచే విధంగా మాట్లాడడం తగదన్నారు. అన్ని కులాలవారు ఓట్లు వేస్తేనే ఎవరైనా గెలవగలరు కానీ ఒక కులం వారు ఓట్లువేస్తే గెలలేరనే విషయాన్ని పవన్‌కళ్యాణ్ గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో మాల మహాసభ రాష్ట్ర నాయకుడు కొండమూరి ప్రకాష్, మాజీ కౌన్సిలర్ మల్లెల బుల్లిబాబు, మేరిగ రమేష్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

జీవించే హక్కులను కాలరాస్తున్నారు

రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు


మాట్లాడుతున్న ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌కుమార్ ధర్మ

చీరాలరూరల్:ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై చేస్తున్న దాడులను ఆపేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీనియర్స్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మేధావులు, ప్రజా సంఘాలు, వివిధ రంగాలకు చెందిన ప్రజలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలలోని సహజవనరులైన ఖనిజ సంపదను భవిష్యత్ తరాలకు అందించడంతోపాటు పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతున్న ఆదివాసీలను కేంద్ర ప్రభుత్వం కొన్ని బహుళజాతి కంపెనీలకు ఆయా సంపదలను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర బలగాలను, సైన్యాన్ని ఉపయోగించి మావోయిస్టులను ఏరివేస్తున్నట్లు నటిస్తు అడవులలో జీవిస్తున్న ఆదివాసీలపై దాడులు చేయిస్తుందని అన్నారు. మావోయిస్టులతో ప్రమాదమున్నదని భావించినట్లయితే కేంద్రం వారితో చర్చలు జరపాలని సమావేశంలో పాల్గొన్న వక్తలు సూచించారు. సమావేశంలో ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నల్లబోతుల మోహన్‌కుమార్ ధర్మ, ఆదివాసీల సంఘీభావ వేదిక ప్రకాశం జిల్లా కన్వీనర్ వీరాంజనేయులు, రాష్ట్ర చేనేత జనసమాఖ్య నాయకులు మాచర్ల మోహనరావు, ఊటుకూరి వెంకటేశ్వర్లు, దామర్ల శ్రీకృష్ణ, చుండూరు వాసు, మచ్చ అర్జునరావు, శీలం రవి, మేడా వెంకటరావు, గాదె హరిహరరావు, దేవన వీరనాగేశ్వరరావు, మేడిన వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్లు, బిర్యాని పాయింట్లలో తనిఖీలు

- నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు స్వాధీనం
- శాంపిల్స్ సేకరణ


నూనె నాణ్యతను మీటర్ ద్వారా కొలుస్తున్న జిల్లా ఆహార తనిఖీ అధికారి ప్రభాకరరావు


ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచిన రొయ్యలు, చికెన్ ప్యాకెట్లు

చీరాల టౌన్: చీరాల పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న రెస్టారెంట్లు, బిర్యాని హోటళ్లలో ఆహార తనిఖీ భద్రతాధికారులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా ఆహార తనిఖీల అధికారి ప్రభాకరరావు నేతృత్వంలో పట్టణంలోని దావత్, మిస్సమ్మ, రావుగారి బిర్యాని, గోదావరి రుచులు అనే పలావ్ పాయింట్లలో తనిఖీలు చేశారు. రెస్టారెంట్లు, పలావ్ పాయింట్లకు ఉన్న ఆహార లైసెన్సులతో పాటుగా కిచెన్, ఫ్రిడ్జ్‌లో రోజుల తరబడి నిల్వ ఉంచిన చేపలు, రొయ్యలు, చికెన్, మసాలా దినుసులు, ఉల్లిపాయల పేస్టులు, పుదీనా చెట్నీలతో పాటుగా రంగు కోసం వినియోగిస్తు ప్రజలను రోగాల పాలు చేసే రంగుల డబ్బాలు, టేస్టింగ్ సాల్ట్ ప్యాకెట్లను చూసి విస్తుపోయారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉంచడం, మూతలు లేకుండా కూరగాయలు, మసాల పౌడర్లుతోపాటుగా వాడిన నూనెను మళ్లీ మళ్లీ వినియోగిస్తుండటంపై నిర్వాహకులను హెచ్చరించారు. రోజుల తరబడి నిల్వ ఉంచిన మాంసం, రొయ్యలు, చికెన్, పెరుగు, మంచూరియా, రంగు డబ్బాలు, టేస్టింగ్ సాల్ట్ ప్యాకెట్లను వ్యర్థ పదార్థాల డబ్బాల్లో పడేయించారు. ప్రజలను అనారోగ్యాలకు గురిచేసే రంగులను చికెన్, చేపలు, రొయ్యలకు పూసిన ముక్కలను శాంపిల్ సేకరించి నిర్వాహకులకు నోటీసులు అందించారు. శాంపిల్ ఫలితాలు వచ్చిన తర్వాత రెస్టారెంట్ నిర్వాహకులపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. జిల్లా ఆహార తనిఖీ అధికారి ప్రభాకరరావు మాట్లాడుతు...చీరాల పట్టణంలో ఉన్న రెస్టారెంట్లు, బిర్యాని హోటళ్లలో ఆహారంపై పలు ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టామన్నారు. రెస్టారెంట్ నిర్వాహకులు యథేచ్ఛగా మాంసాహారాన్ని, వండిన అన్నం, ఇతర పిండి పదార్థాలు, ఉల్లిపాయ, అల్లం, వెల్లుల్లి పేస్టులను, పొదినా చట్నీలను రోజుల తరబడి ఫ్రిడ్జ్‌లో నిల్వ చేయడం దారుణమన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే రెస్టారెంట్లు, హోటళ్ల నిబంధనల ప్రకారం తాజా మాంసాహారం, ఇతర పదార్థాలను వినియోగించాలని, నిల్వఉన్న ఆహారాన్ని వేడి చేసి, రంగులు అద్ది ఆహారం అమ్మకాలు చేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార శాంపిల్ రిపోర్టులు వచ్చిన తర్వాత కలెక్టర్ ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో చీరాల డివిజన్ ఆహార తనిఖీ అధికారి ప్రణీత్, వినియోగదారుల సమాఖ్య ప్రతినిధి దాసరి ఇమ్మానియేల్, పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకుపోవాలి


జ్యోతిప్రజ్వలన చేసి వర్క్‌షాపు ప్రారంభిస్తున్న ముప్పలనేని శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరరావు

బాపట్ల: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకుపోవాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజులపాటు జరిగే స్మార్ట్ మొబిలిటీ, వెహికల్ సేఫ్టీ-ఏఐ సిస్టమ్స్‌పై వర్క్‌షాపును మంగళవారం ప్రారంభించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ స్మార్ట్ మొబిలిటి, వాహన భద్రత, కృత్రిమ మేధస్సు రంగాల్లో తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నైపుణ్యాలను వెలికితీసే వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ వర్క్‌షాపు ఉపయోగపడుతుందని ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు పేర్కొన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి తమ విద్యాసంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. సొసైటీ జాయింట్ సెక్రటరీ డి.వెంకయ్యచౌదరి, ట్రెజరర్ బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమాదేవి, కన్వీనర్ డాక్టరు ఎస్.కార్తీక్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE 1ST ADDITIONAL SENIOR & CIVIL JUDICIAL GUNTUR

I.P. No. 12/2025

Between:
Ghanta Kameswara Rao, S/o.Hanumantha Rao, R/o. Flat No : 402, Jaya's Iconic, 6/2 Chandra Mouli Nagar, Guntur - 522007. ...Petitioner

And

1. Kothapalli Prameela, W/o Late Gopala Krishnaiah, Aged about 67 yrs., Flat No: 201, Sai Venkateswara Towers, 4/3, Ashok Nagar, Guntur, Andhra Pradesh - 522006.
2. Ravipati Ramalingeswara Rao S/o. Pedakotaiah, Aged about 65,Flat No:302, Sunrise Towers, behind Vikas Hotel, J.K.C College road, Guntur - 522006.
3. Ravipati Aruna Kumari W/o Ramalingeswara Rao, Flat No:302, Sunrise Towers, behind Vikas in hotel, JKC college road, Guntur - 522006.
4. Pedalanka Srinivasa Rao S/o Kotaiah, Aged about 60 years, Parchur(M), Lakshmi Puram, Bapatla District.
5. Nalluri Kamalaiah S/o Venkateswarlu, Aged about 60 years, Near Water tank, Inkollu, Inkollu Mandal, Bapatla District.
6. Mothukuri Lakshmi Narayana S/o Hanumantha Rao, Krishna Nagar, 7th line, Ward No:31, Dr.No: 3-2-31.
7. Kurapati Venkateswara Rao, S/o Late China Kotaiah, Lingayapalem Village, H/o. Ankireddypalem Village, Guntur Rural, Guntur District.
8. The Official Receiver, Guntur. ... Respondents

[illegible] 21-04-2025 [illegible] 10:30 [illegible]

KONDRAGANTI SUBBARAO, Advocate for Petitioner, Guntur, Cell No : 9949845343.